# సినిమాకి టైమయ్యింది

ఓ. కల్పన

"సీతా సాయంత్రం రడీగా వుండు, టిక్కెట్లు తీసుకువస్తాను. సినిమాకెళ్దాం" అన్న రామబ్రహ్మం మాటలు గుర్తుకువచ్చి ఉలిక్కిపడి లేచి కూర్చుంది సీతామహాలక్ష్మి. టైం చూసేసరికి సరిగ్గా **3.30** గంటలు అయింది. ఊయల వైపు చూసేసరికి బాబు మంచి నిద్రలో వున్నాడు.

హమ్మయ్య! వాడు లేచేసరికి పనులు తొందరగా చేసుకోవాలి అనుకొని, హడావిడిగా అటుఇటు పరుగెడుతూ, మధ్యమధ్యలో ఊయలలో వున్న బాబు లేచాడేమోనని చూస్తూ, సాయంకాలపు పనులను చకచకా చేస్తోంది. సందెకసులు తీయడం, గిన్నెలు కడగడం, ఆరిన బట్టలను తెచ్చి మడత పెట్టడం చేస్తూనే రాత్రికోసం ఏం కూరగాయలు వండాలా? అని ఆలోచించింది. మనసులోనే ఆ



పొద్దున వండిన పప్పు, చారూ కొద్దికొద్దిగా వున్నాయి, బంగాళాదుంప అయితే అయిపోయింది, అందుకని ఇపుడు త్వరగా ఏది అవుతుందో చూసుకుని చెయ్యాలి అనుకుంది. అనుకుందే తడవుగా ఫ్రిజ్‌లో వున్న కూరగాయలను తీసి, ఒకసారి చూసి, బెండకాయలైతే తొందరగా అవుతాయి అని బయటకు తీసింది.

ఇంతలోపు గేటు దగ్గర ఏదో అలికిడి అయినట్లు అనిపించగానే, ఉలిక్కిపడి, అప్పుడే వచ్చేశాడా? అయ్యో ఇంకా చాలా పనులున్నాయే? ఇంకా రడీ కాలేదని రామబ్రహ్మం కోప్పడతాడేమోనని అనుకుంటూ బయటకు వచ్చింది.

తీరా బయటకు వచ్చి చూస్తే, రామబ్రహ్మం ఆఫీసులో పనిచేసే ప్యూను అయిన గోవిందం కనిపించాడు. కొద్దిగా ఆశ్చర్యానికి గురయినా, ఏం సంగతో అడుగుదామని ''గోపి ఏంటి మీ అయ్యగారు రాలేదా? ఈ టైంలో నిన్నెందుకు ఇక్కడికి పంపించారు?'' అంది.

అపుడు గోపి ''అదేనండి అమ్మగారు, అయ్యగారికి ఆఫీసులో కొద్దిగా ఆలస్యం అవుతుందిట, నాచేత టిక్కెట్లుతెప్పించి పంపించారు. మిమ్మల్ని ఆటో ఎక్కి నేరుగా సినిమా థియేటరుకు వచ్చేయమన్నారండి'' అని గబగబా చెప్పేసి, అంతే ఇదిగా టిక్కెట్లు ఇచ్చేసి వెళ్ళిపోయారు.

ఇక అప్పట్నుంచి దడ మొదలైంది సీతామహాలక్ష్మిలో. సమయం చూస్తే నాలుగు అయింది. సినిమా 6 గంటలకు మొదలవుతుంది. ఇంకా వంట చేయాలి, బాబుకు సెరెలాక్ తినిపించి, స్నానం పోయాలి. తనూ రెడీ అవ్వాలి అనుకుంటూ గబగబా బియ్యం కడిగి పొయ్యిమీద పెట్టి, బెండకాయలు తరిగి వేపుడు చేసింది. వంట అయ్యేలోపు బాబు లేచాడు. వాడికి సెరెలాక్ తినిపించి,గబగబా స్నానం పోసి రడీ చేసి టైం చూసేసరికి సరిగ్గా 5 గంటలు కొట్టింది. అమ్మో అనుకుంటూ, కనీసం 5.30 గంటలవరకైనా ఇంట్లో నుండి కదిలితే 6 వరకు అక్కడకు చేరుకోగలను అనుకుంది. అవునూ! ఇంతకీ ఏసినిమా థియేటరో అనుకోగానే గుండెల్లో మరోసారి దడపుట్టింది.

సీతామహాలక్ష్మి పల్లెటూరిలో వుంటూ ఇంటర్ వరకు చదువుకున్న అమ్మాయి. పట్నంలో ఎల్ఐసి కంపెనీలో ఉద్యోగం చేస్తున్న వరసకు బావ అయిన రామబ్రహ్మాన్ని రెండేళ్ళ క్రితం పెళ్ళి చేసుకుంది. పెళ్ళి కాగానే నెలలోపే పట్నానికి ఒంటరిగా కాపురానికి వచ్చింది. కొత్తకాపురం, కొత్తప్రదేశం, ఇంట్లో ఒక్కతే కావడంతో, ఒకోసారి ఏడ్చేసేది. మరీ అమాయకత్వం కాకపోయినా, కొద్దిగా భయం కలిగిన పిల్ల. చుట్టుపక్కలవాళ్ళు కూడా అంతా కొత్త కావడంతో, రామబ్రహ్మం ఆమెకోసం ఇంట్లో ఫోను పెట్టించి, ఆఫీసు నుండి రోజుకు నాలుగైదుసార్లు ఫోను చేసేవాడు. అంతవరకు వున్న పాత టీవీని తీసేసి కొత్త టీ.వి. తెచ్చి దానికి స్టార్ కనెక్షన్ పెట్టించి, మొత్తంమీద ఆమెను ఒంటరిగా బాధపడకుండా చేశాడు. అంతేకాకుండా వారానికి రెండు సినిమాలు, ఒకోసారి అయితే నాలుగు సినిమాలు కూడా చూపించేవాడు. అసలే ఊర్లో ఉమ్మడి, సంప్రదాయ కుటుంబంలో పుట్టి పెరిగిన పిల్ల, సినిమాలు చూడటానికి మొహంవాచిపోయిన సీతామహాలక్ష్మి సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బయ్యేది.

ఎప్పుడూ... పార్కులని, సినిమాలని, షికారులని బండిమీద తిప్పే రామబ్రహ్మాన్ని చూసుకొని తనంత అదృష్టవంతురాలు లేదని మురిసిపోయింది.

ఇంతలోపే పెళ్ళయి సంవత్సరం గడిచింది. సీతామహాలక్ష్మి నెలతప్పింది. అయ్యో! అసలే పట్నం, పిల్ల ఒంటరిగా వుండి ఏం తింటుందో అని, ఊరినుండి మనవరాలిని చూసుకోవడానికి బామ్మగారు వచ్చేసరికి, అప్పటివరకు తిరిగిన తిరుగుళ్ళకు తెరపడిపోయింది. అసలు కాలు బయటపెడితేనే ఘోరం జరిగిపోతుందేమోనన్నట్టు బామ్మగారు ఆజ్ఞాపనలు పెట్టడంతో గత్యంతరం లేక సీతామహాలక్ష్మి తొమ్మిదో నెల వచ్చేదాకా వుండి, తర్వాత బామ్మతో కలిసి రామబ్రహ్మాన్ని విడవలేక, విడవలేక పురిటికి వెళ్ళింది.

పండంటి బాబును కని, వాడికి ఐదో నెల వెళ్ళిపోతుండగా మొన్నే నెలకిందట, సీతామహాలక్ష్మి బలవంతం మీద, రామబ్రహ్మం వెళ్ళి తీసుకొచ్చాడు. నెల రోజులు బాబుతో అలా ఇలా గడిచినా, సంవత్సరం నుండి ఏం సినిమాలకు, షికార్లకు వెళ్ళలేదని, వారం నుండి రోజూ రామబ్రహ్మాన్ని సినిమాకు తీసుకెళ్ళమని అడుగుతుంది. అయితే అదేంటోగాని, పని ఒత్తిడి వల్ల ఆ కార్యక్రమాన్ని వాయిదా వేస్తూ, ఈరోజే ఆఫీసులో తక్కువ పని వుందని సాయంత్రం ఫస్ట్ షోకు వెళదామని, టిక్కెట్లు తీసుకువస్తాను రడీగా

ఇక అప్పట్నుంచి దడ మొదలైంది సీతామహాలక్ష్మిలో. సమయం చూస్తే నాలుగు అయింది. సినిమా 6 గంటలకు మొదలవుతుంది. ఇంకా వంట చేయాలి, బాబుకు సెరెలాక్ తినిపించి, స్నానం పోయాలి. తనూ రెడీ అవ్వాలి అనుకుంటూ గబగబా బియ్యం కడిగి పొయ్యిమీద పెట్టి, బెండకాయలు తరిగి వేపుడు చేసింది. వంట అయ్యేలోపు బాబు లేచాడు. వాడికి సెరెలాక్ తినిపించి, గబగబా స్నానం పోసి రడీ చేసి టైం చూసేసరికి సరిగ్గా 5 గంటలు కొట్టింది. అమ్మో అనుకుంటూ, కనీసం 5.30 గంటలవరకైనా ఇంట్లోనుండి కదిలితే 6 వరకు అక్కడకు చేరుకోగలను అనుకుంది.

వుండమని చెప్పాడు.

ఆర్టీసి క్రాస్‌రోడ్స్‌లో వున్న సంధ్య 70 ఎంఎంకి వెళదాం అని రామబ్రహ్మం అన్న మాటలు గుర్తొచ్చి గబగబా రడీ అయ్యి వాటర్ బాటిల్, పాలసీసా, నాప్‌కిన్స్, బాబుకి టవల్, అన్నీ పెట్టిన బ్యాగు తీసుకుని తాళంవేసి బయటకు వచ్చి ఆటోకోసం నిలబడింది.

అమ్మో! తార్నాక నుండి ఆర్టీసి క్రాస్‌రోడ్స్ వెళ్ళాలి అంటే ఎంత అంటాడో? ఎంతసేపు పడ్తుందో అనుకుంటూ, అటుగా వస్తున్న ఆటోను ఆపి ఆర్టీసి క్రాస్‌రోడ్స్ వస్తావా? అని అంది. అప్పటికే సమయం 5.35 నిముషాలు అయ్యింది. ఆటోవాడికి తెలుగు రాదు. కాని ఆర్టీసి క్రాస్‌రోడ్స్ అని అర్థమయ్యి 'చలో బైటో' అని మీటరు వేశాడు. గాబరాలో ఏమీ ఆలోచించక ఎక్కి కూచుంది. ఎక్కి కూచున్నప్పటినుండి బాబు ఒకటే ఏడుపు మొదలుపెట్టాడు. ఎంత ఊరుకోబెట్టినా ఇంకా ఎక్కువ చేస్తున్నాడే తప్ప తగ్గడం లేదు. ఎలాగోలా పాల బాటిల్ నోట్లో పెట్టి పడుకోబెట్టింది.

ఇంతలో ఆటో ఆగిపోయింది. ఉలిక్కిపడి చూసేసరికి ఆటో విద్యానగర్ దగ్గర వుంది. అదేంటి ఆర్టీసి క్రాస్‌రోడ్స్ అంటే ఇక్కడ ఆపావు అని అడిగింది. వాడికి ఈమె అన్నది అర్థం అయిందో లేదోకానీ, అబ్ గాడీ నహీ చలేగా మేమ్‌సాబ్, కరాబ్ హోగయా అన్నాడు. వాడేమన్నాడో పూర్తిగా అర్థం కాకపోయినా..., కరాబ్ అన్న పదం అర్థమయి, ఆటో ఇక నడవదని తెలిసి మీటరు ఎంతైందో చూసి డబ్బులివ్వబోతే వాడు, ఔర్ పాంచ్ రూపయా దేదో అంటున్నాడు. అంటే 5 రూపాయలు ఇవ్వమంటున్నాడేమో అనుకుని, మీటరు 15 రూపాయలు అయ్యింది అని చెప్పి ఇస్తుంటే,వాడు తీసుకోకపోవడంతో, అపుడు అసలు విషయం అర్థమయ్యి వాడితో గొడవకు దిగింది. వాడు హిందీలో, ఈమె తెలుగులో తిట్టుకుంటుంటే అటుగా వెళ్ళేవాళ్ళు వచ్చి విషయం తెలుసుకుని ''ఎందుకులేమ్మా గొడవ, ఒంటరిగా బాబుతో వెళుతున్నావు. వాడు అడిగిందేదో ఇవ్వు'' అని సర్ది చెప్పి వాడిని తిట్టి ఈమెచేత 5 రూపాయలు ఎక్కువగా ఇప్పించారు.

ఇంతలోపల సమయం గుర్తొచ్చి చూసుకునేసరికి ఐదు నిమిషాలు తక్కువ ఆరు కావస్తుంది. అమ్మో! అనుకుని ఇంకో ఆటో తీసుకుని థియేటరుకు వెళ్లేసరికి రామబ్రహ్మం గేటు బయట ఎదురుచూస్తూ కనబడ్డాడు. ఈ హడావిడిలో బాబు ఏడుస్తున్నా చూసుకోలేదు. గుక్కపట్టి ఏడుస్తున్న బాబును చూసి రామబ్రహ్మ తీసుకొని ఊరుకోబెట్టబోయాడు. వాడు మరీ లంకించుకుని తెల్లగా వుండేవాడు కాస్తా ఎర్రగా కంది పోయేలా ఒకటే ఏడుపు. రామబ్రహ్మం అడగకపోయినా, ఎందుకు లేటయిందో సీతామహాలక్ష్మి చెపుతుండగా బండి పార్కుచేసి వస్తానని, చేతిలో వున్న బాబుని సీతామహాలక్ష్మికి ఇవ్వబోయాడు. అపుడు చూసింది సీతామహాలక్ష్మి రామబ్రహ్మాన్ని ''అయ్యో! బాబు రెండుకెళ్ళినట్టున్నాడండి మీ షర్టు, ప్యాంటు మీద కూడా అయింది'' అంటూ గబగబా బ్యాగులో నుండి గుడ్డలు తీసి తుడిచి అక్కడవున్న కుళాయి దగ్గరికి వెళ్ళి కడిగింది. అపుడు గుర్తొచ్చింది తనకి, బాబుకి హడావిడిలో డైపర్ వేయలేదని, బ్యాగులో పెట్టుకుంది. తర్వాత ఆటోలో కూర్చుని వెయ్యొచ్చులే అనుకుంది.

ఈ తంతంగం అంతా అయ్యేసరికి 6.15 అయ్యింది. అప్పటికే సినిమా మొదలయ్యి అందరూ లోనికి వెళ్ళారు. తీరా ఇక లోనికి వెళ్దామని, రామబ్రహ్మం టిక్కెట్లు ఏవని అడగ్గానే, సీతామహాలక్ష్మి బ్యాగు అంతా వెతికింది. టిక్కెట్లు కనపడలేదు. మళ్ళీ ఒకసారి వెతికి, లేవండి అంది. అదేంటి! టిక్కెట్లు గోపిచేత పంపించానుగా? నీకివ్వలేదా? అనగానే, ఆ... మీరు పంపించారు, తీసుకున్నాను. హడావిడిలో డైనింగ్ టేబుల్‌పై పెట్టానండి. తీసుకురావడం మరచిపోయినట్టున్నానండి అంది. ఇంకేముంది, కనీసం బ్లాకులోనైనా టిక్కెట్లు దొరుకుతాయేమోనని సీతామహాలక్ష్మి బలవంతం మీద రామబ్రహ్మం ప్రయత్నించినా కొత్త సినిమా కాబట్టి ఆ ఛాన్సు మిస్సయ్యారు. ఈలోపల బాబు గాఢనిద్రలోకి జారుకున్నాడు. ఇక చేసేదేమి లేక, వచ్చిన దారినే ఈసురోమంటూ సీతామహాలక్ష్మి కోరిక నెరవేరకుండానే, 7.30 అవుతుండగా ఇద్దరూ ఇంటిదారి పట్టారు.